# అంగుళీయం

తారకి స్పృహ తప్పిందని తెలియనే తెలియదు. కొంత సేపటి క్రిందట పోస్ట్‌మాన్ వచ్చిన విషయం మాత్రం మెల్లగా గుర్తువస్తోంది.

"స్లయిట్ సింకోపల్ ఎటాక్ ఫాలోయింగ్ ఏ షాక్! పాసిబ్లీ షీ విల్ బి ఆల్ రైట్ ఇన్ ఎబౌట్ ఏన్ హవర్!" అని డాక్టర్ తార భర్త సుగుణాకరరావ్ ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పాడు.

సుగుణాకరరావ్ ఇంటికి వచ్చేసరికి పంకజం, తల్లికి హార్లిక్స్ అందిస్తోంది.

ప్రశ్నలేవీవెయ్యలేదు సుగుణాకరరావ్. మంచం పక్కకి కుర్చీలాక్కుని కూర్చున్నాడు.

పంకజానికి సుమారు ఇరవై ఏళ్లుంటాయి. ఆమెకు చదువంటే చాలా మోజు, ఆంగ్ల సాహిత్యంలో బియ్యే చదివి, తర్వాత జర్నలిజం చదువుతానని దానికి సంబంధించిన పుస్తకాలు కొన్నింటిని చదివేసి యూనివర్సిటీలో సీటుకోసం అప్లికేషన్ పెట్టింది.

తారకి కూతురు మనస్తత్వం బాగా తెలుసు. యువతరం లక్షణం క్షుణ్ణంగా తెలుసు. పాతికేళ్ళయి డాక్టరుగా ప్రాక్టీసు చేస్తూ వింత వింత స్వభావాలతో పరిచయాన్ని సంపాదించుకుంది. ఏది ఏమైందని ఎవరు ఎలా చెప్పినా యువతరం విషయంలో ఆమె ఆశ్చర్యపడదు.... వృత్తి ఆమెను అలా కండిషన్ చేసేసింది. ఆమె మనస్తత్వమే మారింది.

జర్నలిజం కోర్సుకి అప్లికేషన్ పంపించాక పంకజాన్ని ఎమ్మే ఇంగ్లీషుకి కూడా ఓ దరఖాస్తు పంపమంది. పంకజం తెల్లబోయింది. "మరి నువ్వే జర్నలిజం చదవమన్నావ్‌గా!"

తార ఇంగ్లీషులో అడిగింది.

"ఇది నాన్నగారి ఆలోచన. నాకూ నచ్చింది. నీకు ఎందులోనైనా సీటు తేలికగానే దొరుకుతుంది. ముందు ఇంగ్లీషు కాని సైకాలజీ కాని ....తెలిసి జర్నలిజం చదివితే... బంగారానికి తావి అబ్బినట్టూ అని మన భాషలో ఓ సామెత వుంది .... నీ సంగతి నాకు తెలుసు... నిన్ను పెళ్లి చేసుకోమని నే చెప్పను.... నీకు యిష్టమనిపించినప్పుడే నువ్ చేసుకుందువ్ గాని.... నీకు నచ్చిన మనిషి కనపడితే నువ్ చెప్పడానికి సిగ్గు పడవని నాకు తెలుసు ... నా ఉద్దేశం ఏమంటే జర్నలిజం చదవడానికి మనసు బాగా ముదరాలి ... మానసిక పరిపక్వత సంపాదించుకోడానికి సారస్వతం చదవడం కంటే మంచిమార్గం మరొకటి లేదు... ఈ మాట నేను చెబితే నీకు నమ్మకం కలగకపోవచ్చు.... అందరికీ డాక్టర్నయినా, నేను నీకు అమ్మనేకాబట్టి, అమ్మ మాటకంటే ఆడ పిల్లలకి నాన్న మాటంటే గురి ఎక్కువ...."

సుగుణాకరరావ్ తారవంక అలా చూస్తూ ఉండిపోయాడు, ముఖ్యమైన నిర్ణయాలేవయినా తీసుకునేటప్పుడు తార తెలుగులో మాట్లాడదు. తెలుగు కంటే ఇంగ్లీషులో మాటాడి మనుషులను లొంగదీసుకోవచ్చునన్నది భార్య భావనని అతనికి తెలుసు నిజానికి భార్యకి తను ఏ రకమయిన సూచన చెయ్యనేలేదు.

"అవన్నీ ఇప్పుడెందుకులే! ఆర్ యూ ఆల్ రైట్?"

"నెవర్ సోవెల్ ఇన్ మై లైఫ్ ...."

ఆమె కళ్లలో మెరుపుచూసి ముగ్ధుడైపోయాడు సుగుణాకరరావ్. ఆ కళ్లలోని మెరుపు కేవలం

ఆమె ఆనందాన్నీ ఉత్సాహాన్నే సూచించవు. ఆ మెరుపులో ఓ వింత ఓ మిష్టరీ... ఆమె ఆ మూడ్‌లో ఉంటే, ఆ కళ్లు అలా మెరుస్తూ ఉంటే ఆమె ఒక మంత్రగత్తెలా స్ఫురిస్తుంది అతనికి.

'' ఇంతకీ నేను దీని చదువు గురించి....''

''మీరు చెప్పకపోతే నాకేం తెలుస్తుంది... జర్నలిజం గురించి నాకేం తెలుసు! మగాళ్ల మాట మగాళ్లమాటే. తండ్రిమాటకున్న విలువ తల్లిమాటకు రాదు. తల్లి ఎంత చదువుకున్నా సరే. జర్నలిజానికి లోకపరిజ్ఞానమెంత అవసరమో, మానసిక పరిజ్ఞానం కూడా అంత అవసరం. మనుషులూ, మమతలూ ఆదర్శాలూ, ఆంతర్యాలూ ఇవి తెలుసుకోడానికి సైకలాజికల్ థియరీ కంటే సైకాజికల్ రియాలిటీతో పరిచయం ఎక్కువ కావాలి కాబట్టి.... మానసికశాస్త్రం కంటే, సాహిత్యం .... మనిషి గుండెలోతుల్ని తరచి చూసిన సాహిత్య ఖండాలతో.... నా కూతురు జర్నలిజం లో కృషిచేసి 'టైమ్స్' సంపాదకుల స్థాయికెదగాలన్నదెవరు ? మీరా నేనా ? ''

ఆ కళ్లలో మెరుపులు ఎక్కువయ్యాయి సుగుణాకరరావ్ మరిమాటడలేదు.

ముఖకవళికలను గమనించడం మూడవ ఏట నుంచి తనకు తెలియకుండానే అలవాటు చేసుకున్న పంకజం తండ్రివంకే చూస్తూ కుడిచేతిలో కాఫీ కప్పు, ఎడమచేతిలో సాసరుకీ తన పెదవుకీ మధ్య అలా ఉంచేసింది.

'' నువ్ కాఫీ కానియ్ ! '' అంది తార.

'' ఏం అశ్వనీ.... ఎలా ఉంది ? '' అడిగాడు సుగుణాకరరావ్.

భర్తవంక జాలిగా చూసింది తార. తనకు కొద్ది సేపటి క్రింద తెలివితప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఆందోళనకరమైన పరిస్థితులలో మనుషులు పైపూతలనీ, మెరుగులనీ, ప్రక్కకు నెట్టెయ్యడం సహజమే.

తారపేరు తార కాదు. అశ్వనికి ఆమె భర్త పెట్టిన ముద్దుపేరు. పెళ్లయి అతనితో కొత్తగా కలకత్తాలో సహధర్మంతో చరించడానికి వెళ్లినరోజులు.

'' అశ్వనీ! నువ్ ఆకాశంలో తారలా ఉంటావ్... నిన్ను చూస్తుంటే నక్షత్రం నింగిదిగి నేల నడుస్తున్నట్టుంటుంది. నక్షత్రాలలోని నిగూఢరహస్యాలన్నీ నీ కళ్లల్లో మెరుస్తూ ఉంటాయి. చేతికందినట్టే అంది అలా చేయిజారిపోతూ ఉంటుంది. దగ్గరలోనే ఉన్నా ఎంతో దూరంగా ఉన్నట్టుంటావ్!''

''ఏమిటో ఈ కవిత్వం ! కేవలం చదవువుతున్నారా, రాసే ప్రయత్నం కూడా చేస్తున్నారా?''

'' ఆ కళ్లు .... సినిమా నక్షత్రాలు... నో, నో... ఎసాక్రిలేజ్! నువ్ తారవి.... నీ పేరు నాకోసం ... నేను తారగా మార్చేసుకుంటున్నాను.

'' అంటే గెజిట్‌లో వేయించరన్న మాట ''

''డోన్ట్ బీ ప్రొజాయిక్! '' ఆమెముఖాన్ని తన చేతులలోకి తీసుకుని ఆమె కళ్లలోకి చూస్తూ నక్షత్రలోకంలో విహరిస్తున్నాడు.

''మీరు సుధాకర్ అని పేరు మార్చుకుంటే ... ఎట్‌లీస్ట్ ... నేను మీ పేరు నాకోసం మార్చుకుంటే ?'' తార గోముగా అడిగింది.

'' నో! నో.... దేర్ ఈజ్ నథింగ్ పొయిటిక్ ఇన్ మీ .... నాకు ఈ పేరే చాలు ...''

అత్యవసర పరిస్థితులలో తప్ప, సుగుణాకరరావ్ ఆమెను అశ్వనీ అని పిలవడు.

ఆమెకు జ్ఞాపకం ఉన్నంతవరకూ – సిజేరియన్ సెక్షన్ చేసి పంకజాన్ని బయటకు తీసిన తరువాత, తను ఆసుపత్రి బెడ్ మీద ఉన్నప్పుడు మాత్రమే ఇలాగే అడిగాడు. ''ఎలా ఉంది అశ్వనీ'' అని – తార అతని వంక అరమోడ్పు కన్నులతో చూసింది.

'' ఏమైంది ? ''

వేలు పెదవి మీద పెట్టుకుని పంకజం తండ్రిని పక్కగదిలోకి తీసుకుపోయింది.

–'' డాడీ!'' అంటూ ధారా ప్రవాహంలా ఆమె ఇంగ్లీషులో చెప్పిన దాని సారాంశం ఇది–

పంకజం నాలుగు గంటలకు కాలేజీ నుంచి ఇంటికి తిరిగివచ్చింది. బయటతలుపు తెరచి ఉంది. తిన్నగా లోపలకు వచ్చేసరికి తల్లి కుర్చీ చేతి మీద ఒరిగిపడి పోయివుంది. టేబిల్ మీద ఓ చిన్న పార్శిల్ విప్పివుంది. అందులో నుంచి తను బయటకు తీసింది ఓ చిన్న అట్టపెట్టె.

పంకజం వెంటనే డాక్టర్‌కు ఫోన్ చేసింది. తోటి వైద్యుడూ – తారకి పరిచయం ఉన్న వాడూ కావడంతో పదినిమిషాల్లో వచ్చాడు.

ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు. తనతో ఏం మాటాడలేదు – తనని మాటాడవద్దని సైగచేసి ఫోన్ దగ్గరకు వెళ్లి సుగుణాకరరావ్‌కి ఫోన్ చేశాడు.

'కంగారులేద'ని చెప్పి ఓ అరగంటలో తెలివి వస్తుందనీ,. ఆమెను లేపవద్దనీ చెప్పి వెళ్లిపోయాడు. అవసరమనుకుంటే గంట తరువాత ఫోన్ చెయ్యమని చెప్పాడు.

– ఆయన చెప్పినట్టే ఓ అరగంట తరువాత తెలివి వచ్చింది. ఎంత సేపయి అలా ఉన్నదీ – అడిగి తెలుసుకుంది – తార తెలివి వచ్చిన కొంత సేపటికి.

–''రాత్రి రైలుకి నేను బయలుదేరాలి !''

తారఅనడంతో సుగుణాకరరావ్ ఎక్కడికని అడగలేదు. 'వద్దు' అని వారించలేదు. మెల్లగా అన్నాడు '' ఈ పరిస్థితిలోనా?''

'' పంకజం ! నువ్ ట్రావెల్ ఏజెంటుకు ఫోన్ చేసి ... స్టేషనులో నన్ను కలిసి నాకు రెండు టిక్కట్లు ఇవ్వమని చెప్పు '' ... పంకజం వెళ్లిపోయింది.

''అశ్వనీ, ఏమిటిదంతా ? ''

'' మిమ్మల్నేనాడు నేనేదీ అడగలేదు.''

'' డబ్బుకోసం కాదు ... అధికారం కోసమనీ కాదు ...''

''పోరబడుతున్నారు. నాకు కావాల్సింది మీ అభిమానం. మీ అనురాగం ... మీ అవగాహన.... నన్ను మన్నించండి ... నన్ను వారించకండి. నా ఆరోగ్యం గురించి కంగారేమీలేదు ... నాతోపాటు ....''

'' నన్నూ రమ్మంటావా ?''

'' వద్దు నేను పంకజాన్ని తీసుకెళతా ... దానికి మంచి అవకాశం ....''

'' మరి క్లాసులో ?''

'' నేర్చుకునే ప్రజ్ఞఉంటే ఏది క్లాసుకాదు ?''

మరేం ప్రశ్నించలేదు సుగుణాకరరావ్.

'' ఇదేమిటి ?'' అడగకూడదనుకున్నా పార్శిల్ ను చూసి ప్రశ్న పెదవుల మధ్య దాచుకోలేక పోయాడు.

'' తీరికగా చెబుతా !'' మన ఇద్దరి మధ్యా రహస్యాలులేవని మీకు తెలుసు... పంకజం నువ్ బట్టలు సర్ధుకో....''

'' డాక్టర్‌కి ఫోన్‌చేసి ...'' సుగుణాకరరావ్ ఏదో అనబోయి ఆమెవంక చూసి మరేమీ అన లేదు.

'' కోరమండల్‌కి టిక్కట్లు తీసుకువచ్చి ఫ్లాట్‌పారం మీదే ఇస్తానని'' చెప్పాడు.

రైలు ఎక్కిన తరువాతయినా ప్రయాణంలోని ఆంతర్యం చెబుతుందేమో అని చాలా సేపు ఎదురుచూసింది పంకజం.

కొన్ని వందలమైళ్లు ప్రయాణం చేసినా తల్లి ఏంమాటాడలేదు. ఏవో ఆలోచనల్లో ఉంది.

భువనేశ్వర్‌లో రైలాగిన తరువాత కారిడార్‌లో కోచ్ కండక్టరుతో మాటాడింది తార.

పంకజం మంచినిద్రలో ఉంది.

'' ఇది పూర్తిగా నాపూచీ... ఏ కష్టం వచ్చినా బాధ్యతపూర్తిగా నాదే.... సరియైన సమయంలో నన్ను లేపి గుర్తుచేస్తేచాలు....''

కొంత డబ్బు చేతులు మారింది.

పంకజానికి తెలివి వచ్చేసరికి తెల్లవారుతోంది. గడియారం చూసింది. ఐదున్నర.

'' గెట్‌రెడీ ! ఒక్క నిముషంలో తయారవాలి. తయారవకపోయినా ఫరవాలేదు. బ్యాగ్‌పట్టుకుని రైలు ఆగగానే దిగాలంతే'' అలారం చెయిన్ లాగుతున్న తల్లి వంక చూసి పంకజం ఆశ్చర్యపోలేదు.

రైలు ఆగిన రెండు సెకండ్లలో ఇద్దరూ సామాన్లుపట్టుకుని దిగిపోయారు.

– దూరంగా ప్లాట్ ఫారం మీద 'విజయనగరం జం॥' బోర్డు కనపడింది పంకజానికి.

''మనం వెళ్లాల్సింది విశాఖపట్నం కదూ ! విజయనగరంలో దిగిపోయామేం ? ప్యాకెట్ వచ్చింది విశాఖ నుంచి కదా !''

'' చూశావన్నమాట ! ... రావ్‌జీకి ఇంకా కుర్రబుద్ధులే.... బుద్ధుల గురించేముందిలే.... కుర్ర గుణాలే ... ''

'' రావ్‌జీ ఎవరు ?''

'' విత్ ఎనీ లక్, నువ్ చూస్తావేమో !''

'' అంటే ? ''

'' అతను కొస ప్రాణంతో ఉన్నాడని, నా ప్రాణం – కాదు – నా మనసుచెబుతోంది ... దేవుడి మీద నీకు నమ్మకం వుంటే ఆయన బ్రతకాలని ప్రార్థించు. ప్రశ్నలెయ్యకు''

పంకజానికి ఆశ్చర్యం లేదుకాని అయోమయంగా వుంది. తల్లి హఠాత్తుగా ప్రయాణం కావ డానికీ, పార్సిల్‌లో వచ్చిన ఉంగరానికి సంబంధం వుంది....

ఆ ఉంగరానికి తల్లి స్పృహతప్పడానికి సంబంధం వుండి తీరాలి కాని ఉంగరం మొచ్చింది

విశాఖ నుంచి .... పంపిన వ్యక్తి రాఘవరావ్ అని పార్సిల్ కవర్‌మీద రాసుంది.

స్టేషన్‌లో ఆటోలు లేవు... సైకిల్ రిక్షాలే వున్నాయి రిక్షాలో మెరుపులాగ ఒక్కక్షణంలో నాలుగు మాటలు చెప్పింది తార. " నాకయితే వయసు ముదిరిందికానీ రావ్‌జీకి ఇంకా దొంగ లక్షణాలే... ఆయన ఎప్పుడూ అంతే - మహా చిలిపి. నేను నా పెళ్లి కాక ముందు సినిమా చూస్తూ అతని వేలికి తొడిగినదీ ఉంగరం"

అంతవరకే చెప్పి ఠక్కున ఆగిపోయింది. రిక్షా రోడ్డుమీదవున్న గతుకులోపడి లేచింది.

తారకి ఆయాసం వచ్చింది.

తను కదిపినా, ఆమెకు చెప్పాలనే వున్నా, చెప్పే స్థితిలో తల్లిలేదు.

ఆయాసంనుండి తేరుకోకుండానే మొదలెట్టింది మళ్లీ "పంకజం! నువ్ ఇప్పుడు నా స్నేహితురాలివి ... అలా అనుకునే నీకు చెబుతున్నా.... పసిపాప తల్లి ఆలనాపాలనా కోసం తనకు అవేమిటో తెలియకపోయినా ఎలా పరితపిస్తుందో .... అంతకంటే ఎక్కువగా వయసొచ్చిన ఆడ పిల్ల ప్రియుని కౌగిలింతకోసం అర్రులు చాచుతుంది....కాని, ఇది తెలిసిన ఆడపిల్ల తల్లిదండ్రు లెంతమంది ?" కొంచెం ఊపిరి తీసుకుంది... " నువ్ ప్రేమ విషయంలో నేనొక స్నేహితురాలినే అనుకుని, చిన్నదైనా పెద్దదైనా ఏ సంఘటనయినా నాతో వివరంగా చెప్పు....."

" అమ్మా ! నీ గతం గురించి నువ్ విచారిస్తున్నావా? " తల్లి ఆయాసం వెనుక దాగున్న ఆవేశాన్ని గుర్తించాననుకుంది పంకజం.

"నో ! బిలీవ్‌మీ ! సర్టెన్లీ నో ...."

" డాడీ ...నీతో... నువ్.... డాడీని" ఇంకా ఎలాగెలాగో ప్రశ్నలు వెయ్యాలనుకుని తడబడి పోయింది.

సంభాషణ ఇంగ్లీషులోనే సాగుతోంది.

తార కళ్లు మూసుకుంది.

డాక్టర్ రామచంద్రరావ్. డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ అన్న వింత బోర్డు తలుపుకి తగిలించి వున్న యింటిముందు రిక్షా ఆగింది.

తార రిక్షాదిగి డోర్ బెల్ కొట్టింది.

ఎవరో యువకుడు - పంకజం కంటే రెండు మూడేళ్లు పెద్దవుండవచ్చు - తలుపు తీశాడు. పంకజం ఆత్రంగా చూస్తోంది.

" నీ పేరు మధు కదూ ?"

" అవును లోపలకు రండి !"

"ఆరోజుల్లో నిన్ను తెగ ముద్దు చేసేదాన్ని. చూడకుండా వుండలేకపోయేదాన్ని"

" మీరు ?"

" డాక్టర్ అశ్విని ..."

" మీ నాన్నగారు ..."

" ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో - ఆస్పత్రిలో వున్నారు ..."

" నేననుకున్నాను ... మీ అమ్మగారు ?"

'' పోయి రెండేళ్లయింది''

'' ఐయాం సారీ !''

తార మెట్లు దిగిపోయి వచ్చి రిక్షాలో కూచుని '' మంచి హోటల్‌కు తీసుకెళ్లు...''

– '' మమ్మీ ఆయన చనిపోయారా ?''

''ఛీప్ !...''

హోటల్‌రూమ్‌లో చెప్పింది '' ... నేను డాక్టర్ని .... ఆయనున్న స్థితిలో ఆయనను చూడటానికి వెళితే ... ఆయన తట్టుకోలేక పోవచ్చు ... నాకే షాక్ తగిలి ... తెలివి తప్పింది.... బట్... వియ్‌విల్‌సీ...''

''నువ్ చాలా ఆయాసపడుతున్నావ్ ! లేదా ఆవేశపడుతున్నావ్ !'' ధైర్యంగా అనేసింది పంకజం.

''నీకు అది అర్థం కాదు.....''

విలేఖరి ప్రజ్ఞ ప్రశ్నలు వెయ్యడంలోనే కాదనీ, చెవుల్నీ, కళ్లనీ, విజ్ఞతతో, నిశితంగా ఉపయోగించడంలోనే ఉందనీ చదివినట్టు చటుక్కున గుర్తొచ్చింది పంకజానికి.

''నాకిప్పుడెన్నేళ్లుంటాయ్ ?'' హఠాత్తుగా అడిగింది తార.

'' నలభై ఎనిమిది ... కాకపోతేయాభై !''

''ఎప్పుడూ ఇలాగే ఉన్నా ననుకున్నావా ''

తల్లి ఏదో వృత్తాంతం చెప్పడానికి ఉపోద్ఘాతం చెబుతున్నట్టు పంకజానికి అర్థమైంది.

'' కాల ప్రవాహం అనంతం. నిరంతరం కాలచక్రం తిరుగుతుందనీ – తిరుగుతూనే ఉంటుందని తెలిసినా ఈ క్షణమే శాశ్వతమనే భ్రాంతిని కలుగచేసే శక్తి కాలానికే వుంది. మీ అమ్మకూడా ఒకప్పుడు అందంగా హాయిగా, స్వేచ్ఛగా ఇప్పటి నీలా...''

'' నువ్ ఆయాసపడుతున్నావ్, కాఫీ కొంచెం తెప్పించేదా ?''

'' చెప్పేది విను ... నాకు ,,, యిప్పుడు హాయిలేదని కాని, స్వేచ్ఛలేదనికాని నువ్ పొరబడకు... గుండెల్లో అగ్ని పర్వతాలు రగలడమంటే ఏమిటో అనుభవపూర్వకంగా చూశాను.... తెలుసుకున్నాను.... నేను.....''

''నేను బోధపరచుకోగలను '' పంకజం ఆలోచించాలోచించి దూకేసినట్టనేసింది.

'' సిల్లీ గర్ల్ ! ... అది నీకెలా తెలుస్తుంది! నాకు ఇరవై నాలుగేళ్లు, ఎగురుతూ, గెంతుతూ, మెడిసిన్ ప్యాసయిన గర్వంతో, ఇంత ఎత్తుమీద నుంచి నడుస్తూ, జీవితం రంగులకలగా చూస్తూ, ఉద్రేకాలు ఉరకలు వేస్తున్న రోజుల్లో – రాఘవరావ్ అని దొంగ పేరుపెట్టుకున్న రామచంద్ర రావ్.... అదే రావ్‌జీ...''

''ఆయన్ని పెళ్లి చేసుకోవాలనుకున్నావ్ !''

''అనుకోలేదు. అప్పటికే ఆయనకి పెళ్లయిపోయింది. ఒక బిడ్డకూడా ''

'' ఐ కెన్ అండర్‌స్టాండ్ !''

'' అదే పొరపాటు ! నువ్ పొరపాటే అర్థం చేసుకోగలవని నా ఆక్రోశం..... సెక్స్ జీవితసర్వస్వంకాదు... పెళ్లి జీవిత గమ్యంకాదు. అనుభవం... నిరంతరం ... అనుక్షణికం.... నా

జీవితానికి పెళ్లి అవసరంలేదనుకున్నాను... రావ్‌జీ నా సర్వస్వం ... పెళ్లి కాకపోతేనేం అనుకున్నాను.... మా నాన్నగారు నిజంగా యోగి ... ఏదేమయినా చలించని మనిషి ... రావ్‌జీ ఇంటికి వస్తే....మేం గదిలో ... ఆయనేం అనేవారు కాదు .... హి ఈజ్ ఏ గ్రేట్ మాన్ .... భగవద్గీత జీర్ణించుకున్న పండితులాయన .... సర్వత్రా సమదర్శనులు ... నా వివేచనకి నన్ను వదిలేశారు ... ఐనో... ఐడోన్ట్ రిగ్రెట్ ఇట్ నౌ ...''

'' ఆ కాలం వెనక్కి తిరిగి రావాలనా ?''

'' యూ ఆర్ ఫాస్ట్ మెచూరింగ్ ... ఎదిగిపోతున్నావ్. యస్..... నిజమే. కాలం అక్కడ ఆగి పోయివుంటే ... ఆగిపోతుందనే నా భావన ! ఎనీవే ... సెంటిమెంటల్ టియర్స్ నాకు గిట్టవు ... ఐ లవ్‌డ్ హిమ్ .... మా జీవిత మార్గాలు వేరయ్యాయి... నేనతన్ని మరిచిపోయాను ... విత్ వాట్ ఎఫర్ట్ గాడ్ ఓన్లీ నోస్ ...గుండె రాయిచేసుకున్నాను ...'' తార గొంతు పూడుకుపోతోంది. కళ్ల వెంట నీళ్లు ...'' కాలం చాలా విలువైనదికావచ్చును. ఎంత తెలుసుకున్నా, ఎంత విజ్ఞత సంపాదించినా మనుషులు సెంటిమెంటాలిటీని పూర్తిగా వదలలేరు... ఆయన్ని ఒకసారి చూడాలి.... నువ్ వాస్తవాన్ని భరించగలవా ? జర్నలిజం ప్రాక్టీస్ చెయ్యడానికి ఆ ప్రజ్ఞ కూడా కావాలి... నువ్ నాతో వస్తావా ? కళ్లు తిరుగుతాయంటావా ?''

'' – నేను డాక్టర్ కూతుర్ని ...''

'' థాంక్స్ ! కమాన్ !''

– ఆస్పత్రి వాసన. డిస్ ఇన్ ఫెక్టెంట్ వాసన ... బాధ వాసన ... ఆశ నిరాశల పోరాటపు నిశ్శబ్దం.... పంకజానికి కడుపులో వికార పెడుతున్నట్టనిపించింది.

ఏమిటీ విచిత్ర వృత్తాంతం ? ... తనూ స్పృహతప్పి పడిపోకుండా తెలుసుకోగలదా?

'' – డాక్టర్ అశ్వని ఫ్రం కలకటా ... డాక్టర్ రామచంద్రరావ్ ... మై ఫ్రెండ్ ...''

'' అతని పరిస్థితి ఆందోళనకరంగా వుంది ''

'' క్షమించాలి నామాట మీరు వినిపించుకోలేదు...''

'' ఓ యస్ ! యూ ఆర్ ఎ డాక్టర్ ! వెళ్లిచూడండి.... ఓన్లీ ఫైవ్ మినిట్స్ ... నిద్రపోతుంటే... ఒహ్ యూఆర్ ఏ డాక్టర్ ''

రావ్‌జీ ఆస్పత్రి దూలాలవంక చూస్తున్నాడు – సరిగా అతని బెడ్ మీద ఉన్న దూలం బాగా పుచ్చిపోయింది.

'' మార్నింగ్ ....''

'' మార్నింగ్ మీరు – నువ్ అశ్వని కదూ!''

'' దిస్ ఈజ్ పంకజం '' తార పరిచయం చేసింది.

'' ఉంగరం అందిందన్నమాట ... నే వెళుతున్నా ... వి హేడ్ ఎ గ్రేట్ టైమ్ ... మన అమ్మాయా?''

''కాదు ... వాడు .... వాడు... ఆర్నెల్ల వయస్సులోనే కన్ను మూశాడు వైరల్ న్యూమోనియా... ఐకుడిన్ట్ సేవ్''

'' డోన్ట్‌వర్రీ ... ఇరవై ఐదేళ్లు ''

'' గుండెల్లో దాచుకున్నాను. నా క్లయింట్ ఓ ప్రీస్ట్‌కి నా బాధ విప్పిచెప్పాను. కాథలిక్ మతంలో పాపులందరికీ ఇచ్చిన సలహా నాకూ ఇచ్చాడు, మీకు ఉత్తరం రాయవద్దన్నాడు. కలుసుకో వద్దన్నాడు. తలుచుకోవద్దన్నాడు .... మూడోదే చాలా కష్టమైంది.... నాకోసం ప్రార్థనలు చేస్తానన్నాడు. ఇంక చేస్తున్నాడనే నా విశ్వాసం .... మీ సందేశం అందింది ... వెంటనే వచ్చాను''

'' మరి ప్రీస్ట్ మాట ...''

'' పాపం చేసే స్థితిలో మనంలేం ... అవగాహనకు ఎదిగాం ... మీరు ఉంగరం మారు పేరుతో విశాఖ నుంచి పంపబడే ఏర్పాటు చేయడం... మీరింకా యవ్వనంలోనే ఉన్నారనిపించి... చూడాలని''

'' ఉన్నది ఉన్నట్టు చెబుతావ్ అశ్వనీ ... డాక్టర్‌గా నీ శిక్షణవల్లనేమో ! యూ ఆర్ రైట్.... కుర్ర తనంలో మనలోనుంచి ఎప్పుడూ పోకూడదు. పోతే మనిషి మనసూ పోతుంది. నవరుచుల్లో ఏది పోయినా అంతే కదా. వర్ణచక్రంలో ఏ రంగు తీసేసినా తెలుపులోని లక్షణం విలక్షణమే అవుతుంది కదా. వయసు రావడం కాలధర్మం ... వృద్ధాప్యం రాకపోవడం మన అదృష్టం. యూలుక్ వెరీ ఫ్రెష్... ''

'' దృష్టిలోపం ....''

'' ఆరోగ్యలోపాలు ఎంచడం నీ వృత్తి.... అసలు బ్రతికి ఉండడంలోనే ఉంది నా అదృష్టం... రాజ్యాం నన్ను వదిలి వెళ్లిపోయింది. రెండో స్త్రీ నన్ను ఒంటరి చేసింది''

అతని కంటిలో తడి ... తార అతడి చెయ్యి పట్టుకుంది.

'' నీ భర్త ... ? '' రావ్‌జీ అడిగాడు.

అందులో విరుపులేదు - వ్యంగ్యంలేదు. ఆ కుశల ప్రశ్నరూపంలో ఆత్మీయతనిండిన గుండె పలకరింపేవుంది ... ఆత్మీతయను చూసిన పులకరింతే అది.

పంకజం మనసుకి కేథలిక్ ప్రీస్ట్‌ని గురించి వినగానే సెయింట్ జూలియానా సూక్తి జ్ఞాపకం వచ్చింది. సిక్ ఈజ్ బి హావ్‌లీ.... పాపం... పాపకర్మ అవసరమైనదే. చెయ్యదగినదే... ఆల్ ఈజ్ వెల్ ఆల్ షల్ బీ వెల్.

అంతా అవగాహనలోనే వుంది. తనకు తెలిసినదగ్గర తల్లిదండ్రుల మధ్య ఎంత అవగాహన వుందో, సయోధ్యవుందో, అనురాగంవుందో ఒక్క క్షణంలో నెమరు వేసుకుంది... తల్లిలో పాపభావన లేకపోవడం వారి అవగాహనా సామర్థ్యమా ?

పంకజాన్ని దగ్గరకుపిలిచాడు రావ్‌జీ - ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

''సుగుణాకరరావ్ రాజ్యాం పోయినప్పుడు ఇక్కడకు వచ్చాడు ....''

'' నిజం ?''

'' పెళ్లికి ముందే అతనికి నిజం తెలుసు... నేనే చెప్పాను... హి డిడిన్‌ట్ మైండ్ ... ఎ గ్రేట్ మాన్... ది హస్బెండ్ ఆఫ్ ఎ గ్రేటర్ విమన్ ....''

మరి భర్తతనతో ఎప్పుడూ అనలేదేం ?

ఉంగరం ప్రస్తావన మరిరాలేదు.

'' ఐదు నిముషాలైపోయింది '' అంటూ రావ్‌జీ కొడుకు మధు వచ్చాడు....

అతని వంక చూడడంలేదు పంకజం ... రావ్‌జీగారి కళ్లలోకే చూస్తోంది.

ఏదో దివ్యానుభూతి .... ఏదో దైవదర్శనం చేస్తున్న సంతృప్తి.....

''డాక్టర్‌గారు వస్తున్నారు!'' అంది నర్సు.

'' గాడ్ బ్లెస్ యూ మై ఛైల్డ్! గాడ్ బ్లెస్ యూ డియర్!'' రావ్‌జీ పెదవులమీద చిరునవ్వు ఫోటో మీద వేసిన మాలలా వేలాడింది.

– తార చటుక్కున తన వేలికి పెట్టుకొచ్చిన ఉంగరాన్ని రావ్‌జీ వేలికి తొడిగింది.

తన జీవితం నిజంగా మలుపు తిరిగినట్టు ముఖంలో ఆనందాతిశయంతో కళ్లు మూసుకున్నాడు రావ్‌జీ.

**స్వాతి**
ఏప్రిల్ –85